"అబ్బబ్బ ! కాలికి కాస్త దెబ్బతగుల్తే — యిహ కాళ్లమే తీరిపోయింది అన్నట్లుగా యెవరైనా ప్రవర్తిస్తార్రా మంజూ ! ఏమిటా పిచ్చితనం ! ఇంకో వారంరోజుల్లో యెప్పటిలా తిరుగుతావని డాక్టర్ చెప్పలేదూ ?" దెబ్బ తగిలినకాలుకి కట్టిన కట్టుని పదేపదే చూసుకుంటూ— ఇహ కుంటిదాన్నయిపోతా నేమోనని బెంగపడుతున్న భార్యవంక చూస్తూ అన్నాడు శేఖర్. కిటికీదగ్గరగా ఉన్న మంచంమీద గోడకి చేరగిలవేసిన గుండ్రటి దిండుని ఆనుకుని కూర్చున్న మంజు మొహంలో మహారాజ్యాల్ని కోల్పోయిన మహారాణి తాలూకు దీనత్వం కన్పిస్తోంది.

"ఏం ఫర్వాలేదు. కత్తిపీటగాబట్టి కాస్త సెప్టిక్ అయింది. దానికంత భయం దేనికి ?" మంజు కూర్చున్న మంచానికి ప్రక్కగా ఉన్న డ్రెస్సింగ్ టేబిల్ముందు నిలబడి అద్దంలో చూసుకుంటూ టై గట్టుకుంటూ అన్నాడు.

"మీ రలాగే అంటారు. మీకేం తెలుస్తుంది నా బాధ ! ఈ పదిరోజులనుంచి కాలు క్రింద పెట్టకుండా ఈ మంచంమీద కూర్చుని నేను చూస్తున్న నరకం మీ కే కొంచెం అర్థం అయినా మీరలా అనరు. అయినా నేనేమైపోతే మీకేం ? మీ క్లబ్‌లకి, మీటింగ్స్‌కి ఏం లోపం రావటం లేదుగా !" ఎర్రపడ్డ మొహంతో, ముడుచుకున్న పెదవులతో భర్తవైపు చూడకుండానే అంది మంజు.

"అదుగో ! నువ్వు వెళ్లమంటేనేగా తయారవుతూంది నేను. సర్లే పోన్లే. నీకంత కష్టంగా ఉంటే అసలు వెళ్లనేవెళ్లను. వీడో క్లబ్ వార్షికోత్సవం దగ్గరకు వస్తోందికాబట్టి దాని కమిటీసభ్యుల్లో ముఖ్యుడ్ని కాబట్టి. లేకపోతే వెడ్తానా ? పోన్లే ...." కట్టుకుంటున్న టై మధ్యలో ఆపి విప్పేసి శేఖర్ వచ్చి మంజు ప్రక్కన కూర్చున్నాడు.

"ఏ మక్కర్లేదు. వెళ్లండి. అయినా ఒక రోజా రెండురోజులా ? మీరు వెళ్లండి. మరీ ఎందుకో దిగులనిపిస్తోంది. మీరు ప్రక్కన ఉన్నంతవరకూ ఏం గుర్తురాదుగాని, మీరు కాస్త కనుమరుగైతే ఈ గాయం ఇంతింతయ్యి ఓ పెద్ద రాక్షసిలా నన్ను భయపెడ్తోంది. నువ్వు కుంటిదానివి సుమా ! ఇంక జన్మలో నువ్వు మామూలుగా నడవలేవని వెక్కిరిస్తుంది. అదే—

తెలిసిన విలువలు

యద్దనపూడి సులోచనారాణి

ఊహా ప్రపంచానికి అలవాటు పడిన మంజు, శేఖరం నుంచి ఏమి ఆశించింది? ఆమె కోరిక ఎలా తీరింది?

మీరు ప్రక్కనుంటే భయంవెయ్యదు. కొంచెం ధైర్యంగా ఉంటుంది. నే నెలాటి పరిస్థితుల్లో ఉన్నా, అందంగా ఉన్నా లేకపోయినా, ఆరోగ్యం పాడయినా, అంగవైకల్యం ఉన్నా నన్ను ప్రేమించి ఆదరించగల వ్యక్తి ఒకరు నాకున్నారు అనిపిస్తుంది. అంతే! అందుకే ఎప్పుడూ మిమ్మల్ని ఎక్కడికీ వెళ్లనివ్వకుండా చెయ్యాలనిపించేది. అంతేకాని — లేకపోతే, ఇదివరకెప్పుడైనా నేను ఇలా చేశానా? ఏరోజు నన్నా మొహం ముడుచుకున్నానా? అది మీకు తెలియదా? మీరు గ్రహించలేరా అసలు విషయం?" సిగ్గుతో బాధతో ఎర్రవడిన మొహాన్ని అరచేతుల్లో దాచుకొంటూ అంది మంజు.

క్షణంసేపు పరిశీలనగా భార్యవంక చూసిన శేఖరం మరికొంచం దగ్గరగా జరిగి మంజు తలమీద చెయివేసి జుట్టు నిమురుతూ "నాకు తెలును మంజూ! ప్రతి చిన్నవిషయాన్ని విపరీతంగా తీసుకుని అనుభూతిపొందే నీ మనసు ఎలా గిలగిలలాడుతోందో నేను ఊహించుకోగలను. నన్ను వెళ్లద్దనటంలో నీ ఉద్దేశ్యం నా కర్థమవుతోంది. కాని యేంచెయ్యాలి చెప్పు. ఒక్క

(43-వ పేజీ చూడండి)

అరగంట కంటే ఎక్కువ వుండను. అన్నీ చెప్పేసి వచ్చేస్తాను. ఈరోజు వెళ్ళాలి. ఏదీ తలెత్తి చూడు. ఊ ! ఇదుగో గడియారం - దగ్గర పెట్టుకో. ఇందులో ముల్లు 7 చూపేసరికి నేను నీ ప్రక్కన ఉండకపోతే నీ ఇష్టంవచ్చిన శిక్ష విధించు. ఏం—తలెత్తు మరి'' తనచేతికున్న గడియారం తీసి మంజు చేతికి పెడ్తూ అన్నాడు శేఖరం.

"వద్దు. ఫర్వాలేదు. మీరు వెళ్ళండి'' గడియారం చేతికి పెట్టనివ్వకుండా చేతులు వెనక్కు పెట్టుకుంటూ అంది మంజు.

శేఖరం బలవంతాన మంజుచేతికి గడియారం పెట్టి మళ్ళీ అద్దంముందుకు వచ్చి టై కట్టుకోసాగాడు. "మందు తాగు. ఈరోజు జ్వరం రాకపోతే ఇహ రాదని చెప్పాడు డాక్టరు. నేను వస్తూ ఆ టాబిలెట్స్ తెస్తాను. మందు తాగటం మర్చిపోకు. సాధ్యమైతే ఇంకా ముందుగానే వచ్చేస్తాను. ఏం ?'' మాటలు చెబ్తూనే వెళ్ళిపోయాడు శేఖరం.

క్రమంగా అతని కారు వెళ్ళిపోతున్నశబ్దం దూరమైపోవటంతో మంజు లేచి సరీగ్గా కూర్చుంది. 'గడియారం చూస్తుండు. ముల్లు 7 చూపించేసరికి నేను రాకపోతే చూడు' భర్త తనచేతికి పెట్టివెళ్ళిన గడియారాన్ని ఆప్యాయంగా తడిమి చూసుకుంది. గడియారం చైన్‌లో శేఖర్‌చేతిస్పర్శ ఇంకా ఉన్నట్టుగానే ఉంది మంజుకి.

ఏదయినా కాలికి తగిలిన ఈ దెబ్బ ఇది వరకు తెలియని ఓ కొత్త అనుభవాన్ని నేర్పింది. మంజుకి ఓవిధంగా ఆనందంగానే ఉంది.

పదిరోజులక్రితం శేఖర్ ఆఫీసు పనిమీద క్యాంప్ వెళ్ళాడు. ఎనిమిది రోజులు—ఏదో ఇన్‌స్పెక్షన్‌గొడవ ఉండటంవల్ల — బెంగాల్‌నుంచి నుంచి ఆఫీసర్ రావటంవల్ల మంజుని తప్పనిసరిగా ఇంటిదగ్గర వదిలేసి వెళ్ళాల్సివచ్చింది. ఎనిమిదిరోజులూ ఎనిమిది యుగాల్లా గడిచివాయి. ఎంతో కష్టంమీద శేఖరం తిరిగివచ్చే రోజు వచ్చింది. ఆరోజు సాయంత్రంగూడ చాలా ఆలస్యంగానే అయింది.

అప్పటికే స్నానం అదీ చేసేసి శేఖర్‌కి ఎంతో ఇష్టమైన జరీఅంచు తెల్లచీర, జాకెట్ వేసుకుని ఇప్పుడో, కాసేపట్లోనో విన్పించబోయే 'మంజూ' అనే పిలుపుకోసం ఒళ్ళంతా చెవులు చేసుకుని ఇల్లంతా కలియదిరుగుతోంది. వంటయింట్లో వంటమనిషి సాయంత్రానికి కావాల్సిన యేర్పాట్లు చూస్తోంది. శేఖర్ రాగానే స్వయంగా తనచేతుల్తో కలిపిన కాఫీ ఇవ్వాలనే తొందరలో ఉన్న మంజు వంటింట్లో కాఫీ కలిపే ప్రయత్నంలో ఉంది. కాఫీ కలపటం పూర్తయింది. అది ఫ్లాస్కులో పోయబోతుండగా హాల్లోంచి 'మంజూ' అన్న పిలుపు విన్పించింది. అరె ! కారు హారన్ గూడ విన్పించలేదే—అనుకున్న సమయానికి అరగంట ముందుగానే—ఆ పిలుపు విన్పించటం మంజు తన చెవుల్ని తనే నమ్మలేక హాల్లోకి పరుగెత్తింది. ఆ పరుగెత్తటంలో చాపి అంగ వెయ్యటంలో అది కత్తిపీటమీద పడింది. పదునుగల

తెలిసిన పిలుపులు

(17-వ పేజీ తరువాయి)

కత్తిపీట దొరికిన అవకాశాన్ని దుర్వినియోగపరుచుకునే మూర్ఖురాల్ని కాదు అన్నట్లు మంజు పాదాన్ని కసిక్కిన కొరికింది. 'అబ్బా !' అంటూ ఒకసారి వంగి పాదాన్ని విదిలించుకుని ఆ కాలితోనే కత్తిపీటని ప్రక్కకు నెట్టి మంజు సుడిగాలిలా హాల్లోకి వచ్చింది. అప్పటికే శేఖర్ బూటు లేస్ విప్పి కాళ్ళతో గోడవారగా తోస్తున్నాడు.

"ఇంత తొందరగా వచ్చేశారేం. అబ్బ ! ఈరోజు అసలు సాయంత్రమే కాలేదు. మీ రొచ్చేశారు. ఎంత బాగుంది. ఈ వారంరోజులు ఒక్క నిమిషం గూడ తోచలేదు. శేఖర్ చేతుల్లో వాలిపోయిన మంజుకి తన కాలు తెగటం కాని, అది రక్తం గుమ్మరిస్తున్నట్లు గాని తెలియదు.

"ఆగు. ఉండుమరి—నన్ను మేజోళ్ళు విప్పనీ'' తన మెడచుట్టూ చేతులు వేసిన మంజు చేతులు

ఆఫీసరు : నేను ఇప్పుడు ఎక్కడవున్నాను.

గుమస్తా : కుర్చీలో సార్ !

ఆఫీసర్ : అది కాదయ్యా! నా టూర్ ప్రోగ్రాం ప్రకారం చూచి చెప్పు.

గుమస్తా: రాజమండ్రిలో వున్నారండి.

ఆఫీసర్ : ఈ కాగితాలమీద నీవే "బై ఆర్డర్"లో సంతకము పెట్టి పంపు.

—కొల్లా వెంకటేశ్వరరావు
(పెదకూరపాడు)

విడదీస్తూ అన్నాడు శేఖరం. అసలు విషయం వంటింట్లోంచి చేత్తో గరిట పట్టుకుని వంటమనిషి కళ్ళు పెద్దవి చేసుకుని తొంగి చూస్తోంది.

"యేమిటిది. నువ్వు నడుస్తుంటే యీ ముద్ర లేమిటి ?'' క్షణంసేపు వంటమనిషి చూస్తోందన్న సంకోచంతో నేలమీద వాలిన శేఖరం చూపులు తెల్లబోయినాయి. అప్పుడు గాని మంజుకి గుర్తు రాలేదు. కాలుకి దెబ్బ తగిలిందని.

"అరె—యేదీ కాలు—యింత రక్తం రావటం యేమిటి ?'' శేఖరం చప్పున మోకాళ్లమీద వంగి కూర్చొని మంజు పాదాన్ని చేతుల్లోకి తీసుకున్నాడు.

గులాబీరేకుల తాలూకూ నాజూకుతనాన్ని నింపుకున్న పాదంలో రెండంగుళాలు లోతుగా గాయం అయింది. ఇంకా రక్తం వస్తూనే ఉంది. ఆ రక్తంలో ఎరుపుకి శేఖరం కళ్ళు క్షణంసేపు చెదిరినాయి.

"అవును. వస్తుంటే కత్తిపీట ఉంది. దానిమీద కాలు వేశాను. కొంచెం దెబ్బ తగిలింది.'' మంజుకి అప్పటికి గాని గాయంవల్ల కలిగే బాధ గుర్తుకు రాలేదు.

"నీ మొహం—అన్నీ ఖంగారే. అంత తొందరే—వచ్చినవాడ్ని ఏమైపోతాను. కాస్త నిదానంగా రాకూడదూ—అంత వళ్ళు తెలియకుండా యెలా పరుగెత్తావు ? అసలు వంటయింట్లో నీకేం పని వచ్చింది. క్రింద కత్తిపీట ఎవరు పెట్టారు ?'' భార్య నడుంచుట్టూ చెయివేసి గోడవారగా ఉన్న కుర్చీలో కూర్చోపెట్టాడు. మంజు నడిచిన ప్రతి అడుగు రక్తంతో తడిసి నేలమీద ముద్ర పడింది.

"అయ్యయ్యో. యెంత రక్తమో !'' శేఖరం చప్పున వంగి పాంట్ జేబులోంచి జేబురుమాలు తీసి పాదానికి నొక్కిపట్టాడు. ఇంట్లో అడుగు పెడ్తూనే కోపంగా కేకలు వేస్తున్న శేఖరం కంఠస్వరం విని నౌకర్లు, వంటమనిషి హాల్లోకి పరుగెత్తుకొచ్చారు.

"అబ్బా ! నొప్పేస్తోంది.'' కుర్చీలో వెనక్కు వాలి మంజు చేతుల్తో కళ్ళు మూసుకుంది. కాని బాధతో కాదు. శేఖరం ఆదుర్దా నిండిన స్వరం యిచ్చే అనుభూతితో ! పాదాన్ని సున్నితంగా యెత్తి రెండు చేతుల్తో పట్టుకున్నప్పటి స్పర్శానందంతో.

బట్టలు కూడా మార్చుకోకుండా—మంజుని అలాగే కారులో కూర్చోపెట్టుకుని డాక్టర్ దగ్గరకు తీసుకువెళ్ళాడు శేఖరం. గాయం కొంచం లోతుగా తెగినా ఫర్వాలేదని, నయమైపోతుందని చెప్పి డాక్టరు కట్టు కట్టాడు. మంజుకి ఏమీ బాధనిపించలేదు. కట్టు కట్టిన కాలుతో హుషారుగానే నడిచివచ్చి కారులో కూర్చుంది.

"మరీ అంత వళ్ళు తెలియకుండా ఉండటం మంచిదికాదు మంజూ ! చూడు. ఎంత గాయం అయిందో—చాల రక్తం పోయింది.'' ఆ రాత్రి పడుకోబోయేముందు మంజు కాలి కట్టుని చేతితో తాకి చూస్తూ అన్నాడు శేఖరం.

"తగిలేత్తే తగిలింది. నాకు బావుంది. నాకోసం మీ రెప్పుడూ యిలా ఆదుర్దా పడలేదు. ఇందాక రక్తం కారుతుంటే మీరు వంగి నా పాదాన్ని పరిశీలిస్తుంటే అప్పుడు మీ కళ్లలో భావం చూస్తుంటే నా కెంతో హాయిగా ఉందీ ! నాకు ప్రతిరోజూ ప్రతి నిముషం అలాంటి అనుభూతి మీ కళ్లలోంచి అందితే ఎంత బాగుంటుంది. కొద్దిగా అలిసినా ఉత్సాహంగా కళ్లల్లో మెరుపులు కురిపిస్తూ అంది మంజు. శేఖర్‌కి అర్థంకాలేదు. కాని తనకోసం పరుగెత్తుకు రావటంలో మంజుకి అంత పెద్ద దెబ్బ తగిలింది అని గుర్తొచ్చేసరికి అతని మనసు మంజుపట్ల జాలితో—అదేదో సున్నితమైన భావంతో నిండిపోతోంది.

ఆ మర్నాడుగూడ ఏమంత బాధనిపించలేదు. శేఖరం వద్దని కేకలు చేస్తున్నా విన్పించుకోకుండా మంజు యింట్లో మామూలుగానే తిరి

గింది. కానీ మూడో రోజుకి పాదం బాగా వాచిపోయి మంజుని మంచంమీదనుంచి కాలు క్రిందకి పెట్టనివ్వలేదు. చాలా బాధగా గూడ అన్పించింది. ఆరోజు డాక్టర్ తనే యింటికి వచ్చాడు. ఆ సాయంత్రం జ్వరం కూడా వచ్చింది. దానికి తోడు సెప్టిక్ అయింది. ఆపరేషన్ చెయ్యాలన్నాడు డాక్టర్.

"వద్దు. వద్దు. పాదంలో సగం తీసేస్తాడేమో—లేకపోతే ఒకటి, రెండు వేళ్ళు కత్తిరించేస్తాడేమో—వద్దు నాకు, ఆపరేషన్ వద్దు. అదే తగ్గిపోతుంది. నన్ను మీరంతా కలిసి కుంటిదాన్ని చెయ్యొద్దు." గోలపెట్టేసింది మంజు.

"ఏమిటది — మరీ చిన్నపిల్లలా! వేళ్ళెందుకు కత్తిరిస్తాడు నీ మొహం. కాస్తంతని కొండంత చెయ్యకు అనవసరంగా" విసుక్కున్నాడు శేఖరం.

"ఇప్పుడైతే యీ కాస్త ఆపరేషన్‌తో సరిపోతుంది. ఇది వద్దని మానేస్తే సరె. మీ యిష్టం. కొన్నాళ్ళు పోయింతర్వాత పూర్తి కాలంతా తీసెయ్యాలి. అది మీకు యిష్టమే నంటే నాదేం అభ్యంతరం లేదు. మెడిసిన్‌బాగ్ చంకన పెట్టుకుని డాక్టర్ వెళ్ళిపోవటానికి లేచాడు.

"పూర్తి కాలంతా తీసెయ్యటమా ?—ఓమూల కాస్త వంకర భరించలేని తను ఓకాలు పూర్తిగా లేకుండా ఉండటమా ! భయంతో మంజులో ప్రతినరం వణికింది. చివరికి చాలా సేపయింతర్వాత శేఖర్ వళ్ళో తలదాచుకుని నెమ్మదిగా 'ఆపరేషన్ చెయ్యమనండి—కాని వేళ్ళు కత్తిరించవద్దనండి. ఒకసారి మా పిన్నికి యిలాగే సెప్టిక్ అయితే కుడిపాదం మూడు వేళ్ళు కత్తిరించేశారు. నే నా వికృతాన్ని భరించలేను' అంది.

"భయంలేదని చెబ్తుంటే వినవేం మంజూ ! వేళ్ళెందుకు తీసేస్తాడు. పోనీ ఒకవేళ తీసెయ్యాల్సి వస్తే—నావి తీయించి వాటి స్థానంలో పెట్టిస్తాను. సరేనా ? కొంచం మోటుగా వుంటాయేమో ! మరి అదైనా భరించగలవా ?" నవ్వుతూ అన్నాడు శేఖరం, బుజ్జగిస్తున్నట్లు.

అసలు మంజు స్వభావమే అంత. పొరపాటుగా యెక్కడైనా రోడ్డుమీద అక్కడా ఏ కుంటివాళ్ళన్నా, గుడ్డివాళ్ళన్నా కన్పిస్తే భయంతో చప్పున మొహం తిప్పుకుంటుంది. ఓరోజు — శేఖరానికి బాగా గుర్తుంది. ఆరోజు ఓ ఫ్రెండ్ యింటికి భోజనానికి వెళ్ళి తిరిగివస్తూ పెట్రోల్ కోసం ఓ బంక్ దగ్గర కారు ఆపితే అక్కడ కన్పించిన ఓ ముష్టిదాన్ని చూసి మంజు రెండు రోజులు ఒకటే బాధపడింది.

అలాంటి ముష్టిదాని చేతిలో నెత్తురుగుడ్డులా ఉన్న ఓ పసికందు. ఆ పిల్లాడ్ని చూపించి 'అయ్యా—దానం—బాబూ. పిల్లాడు అంటోంది. అసహ్యంతో, భయంతో మొహం తిప్పేసుకుంది మంజు. ఇవేం గమనించని శేఖరం జేబులోంచి పర్సు తీసి చేతికి వచ్చిన నాణేన్ని తీసి ముష్టిదాని వైపు విసిరేశాడు. పెట్రోల్ నింపుకున్న కారు ముందుకు కదిలింది. అంతవరకు నవ్వుతూ, తుళ్ళుతూ ఖబుర్లు చెప్తున్న మంజు హఠాత్తుగా మూగవోయినట్లు కూర్చోవటం చూసి

తెలిసిన విలువలు

శేఖరం కారణం అడిగాడు. మంజు అడిగింది. 'మరీ—ఈ సృష్టి కంతటికి కారణం భగవంతుడు అంటారే—దేవుడే యీ సృష్టికి కారణం అయితే ప్రపంచంలో అసలింత వికృతం ఉంటుందా ? మనం యిలా ఆరోగ్యంగా హాయిగా ఉంటాం. వాళ్ళెందుకు అలా ఉంటారు మరి. కానీ—కానీ—భగవాన్ నువ్విది సృష్టించినా సృష్టించకపోయినా అసలు నువ్వనేవాడివి ఉంటే నీ కే మాత్రం కరుణ, జాలి అనేవి ఉంటే అవి వాళ్ళకి పూర్తిగా యిచ్చేసి వాళ్ళకు నువ్వు చేసిన అన్యాయంలో సగం అయినా తీర్చు.'

దానిమీద శేఖరం వ్యాఖ్యానం చేయ్యలేదు. వాదించలేదు. విని వూరుకున్నాడు. కాని తన నంతగా కదిలించని కొన్ని విషయాలు మంజుని అలా కుదిపి కుదిపి మనశ్శాంతిని తినెయ్యటం—వాటికోసం మంజు బాధపడటం అతనికి చిత్రంగానే ఉండేది.

అదంతా గుర్తొచ్చిన శేఖరం ఆపరేషన్ అయింతర్వాత మంజు తల నిమురుతూ 'ఫర్వాలేదు. ఒక వారం రోజులు పూర్తి విశ్రాంతి తీసుకుంటే మామూలుగా అయిపోతావు' అని ధైర్యం చెప్పాడు.

మంజు అసలు మంచంమీద నుంచి క్రిందికి కాలు దింపనే దింపకూడదు అన్నాడు డాక్టరు. అంతకంటే నరకం వేరే లేదు. అయినా భరించక తప్పలేదు. శేఖరం క్యాలెండరు తెచ్చి మంజు కెదురుగా పెట్టాడు.

ఎలాగైతేనేం శేఖరం సపర్యలతో, వంట మనిషి మాటలతో ఆరు రోజులు యిట్టే గడిచిపోయినాయి. మంజు కోసం శేఖరం అన్ని పనులూ మానుకున్నాడు. కారు గారేజ్ నుంచి తీసి ఆరు రోజులైంది. మంజు పెళ్ళయింతర్వాత శేఖరం యింత స్థిమితంగా తన ప్రక్కన కూర్చోవటం యిదే మొదటిసారి. క్రమేపీ సాయంత్రం పూట జ్వరం రావటం గూడ తగ్గిపోయింది. గాయం కూడ మూడొంతులు తగ్గిపోయింది. ఒక వంతు వచ్చి ఉండగానే లేచి కొంచంగా యెక్కువ శ్రమ లేకుండా అటూ యిటూ అడుగులు వెయ్యమన్నాడు డాక్టర్. శేఖర్ తనే స్వయంగా మంజు చేతిని తన మెడచుట్టూ వేయించుకుని ఎడంచెయ్యి భార్య నడుంచుట్టు వేసి గదిలో గుమ్మం దగ్గర నుంచి గోడ వరకు, గోడ నుంచి కిటికీ దగ్గరకూ నడిపిస్తున్నాడు. అతని నిదానానికి, ఓపికకి — శ్రద్ధకి మంజు ముగ్ధురాలై చూడసాగింది. వేళపట్టున గుర్తు పెట్టుకుని మందు కలిపి యివ్వటం, సాయంత్రంపూట జ్వరం వచ్చిందీ లేదో అని థర్మామీటర్‌తో చూడటం, మధ్యాహ్నంపూట యేమీ తోచటం లేదంటే యేదైనా పుస్తకం చదివి విన్పించటం, మంజుకి జీవితాంతం యేదయినా జబ్బుచేసి అలా ఎప్పుడూ శేఖరం దగ్గరగా ఉంటే బాగుండు ననిపిస్తోంది. తన కాలు తగ్గిపోతే — మళ్ళీ మామూలు జీవితం, అతని స్నేహితులు, సభలు, సమావేశాలు, విందులు వినోదాలు—అప్పుడు గూడ తమ ప్రక్కన ఉంటుంది. కాలుకి దెబ్బ తగలనంతవరకూ మంజుకి అదీ అందంగానే కన్పించింది. కానీ కాలికి తగిలిన యీ గాయం మంజుకి తెలియని ఓ విలువైన సుఖాన్ని — శేఖరంలో తనంతకుముందు చూడని లోతుల్ని చూపింది. ఇప్పుడైతే తమిద్దరే ! పేకాటకీ, క్రికెట్‌కీ లొక్కుపోయే రాక్షసులు లేరు.

ఓరోజు సాయంత్రం తనకి మందు కలిపి యిస్తున్న భర్తని తదేకంగా చూస్తున్న మంజు "మీరు డాక్టరై—నేను పేషెంటునై యెక్కడో ఓ మారుమూల — చాలా అందంగా ఉన్న పరిసరాల మధ్య—యెత్తుగా ఓ కొండమీద చిన్న డాబాలో ప్రతిరోజు సాయంత్రం నే నిలా వెనక్కు జారగిలబడి కూర్చుంటే — మీరలా టేబిల్‌దగ్గర నిలబడి మందు కలుపుతుంటే ఎంత బాగుంటుందికదూ !' అంది. మందు కలుపుతున్న శేఖరం ఆగి మెడ తిప్పి భుజం మీదుగా భార్యని చూసాడు. మంజు నిజంగా ఎక్కడో కొండమీద డాబాలో కూర్చున్నట్లే ఉంది.

"ఎందుకలా చూస్తారు. ఏం అలా ఉంటే బాగుండదా ?"

"బాగానే ఉంటుంది. కాని, పులులూ, సింహాలూ వస్తాయని భయం. ఎందుకైనా మంచిది. రేపట్నుంచి ఓ గన్ తెచ్చుకుని షూటింగ్ నేర్చుకుంటాను. ఇదుగో మందు తీసుకో ! కాని మంజూ ! నువ్వు కథా రచయిత్రివి ఎందుకు కాలేదో నాకు తల బద్దలు కొట్టుకున్నా అర్థం గాదు. ఇంత ఊహాలోకం ఉన్నవాళ్ళు తప్పనిసరిగా కథలు రాయాలి లేకపోతే — మాబోటి వాళ్ళకు ప్రమాదం."

"అంటే ?" అంది మంజు మందుగ్లాసు తీసుకోకుండా శేఖరం కళ్ళల్లోకి చూస్తూ.

"కాదా మరి. చాలామంది ఊహించటంలో తృప్తిపడి ఊరుకుంటారు. నువ్వు ఊహించింది ప్రతీదీ స్వానుభవంలో కావాలంటావు" శేఖరంతో పాటు తను గూడ నవ్వేసింది మంజు. ఆ క్షణం ఎంత బావుంది !

చాలసేపట్నుంచి శూన్యంలోకి చూస్తున్న మంజు కళ్ళు క్రిందికి వాలి చేతికున్న గడియారం చూపాయి. ముల్లు బద్ధకంగా బరువుగా, నిర్లక్ష్యంగా తిరుగుతోంది. 7 కావటానికి మరో పది నిముషా లుంది. ఎందుకో చెప్పినట్లుగా సరిగ్గా 7 గం. కి శేఖరం వస్తాడంటే మనసు నమ్మలేకుండా ఉంది. తనచేత వెళ్ళ అన్పించుకునేందుకే అతనంత నమ్రతగా, నమ్మకంగా పల్కింది. మంజు మనసులో కలిగిన అనుమానం నిజమేనని గడియారం ఋజువు చేసింది. 7 గం. దాటింది. చకచకా పదిహేను నిమిషాలు గడిచాయి. కాని శేఖరం రాలేదు. రాలేదని అతన్ని

అని లాభంలేదు. అసలు తప్పు తనది. వెళ్లండి— వెళ్లండి అంది. ఇంకొంచెంసేపు అలాగే మూతి ముడుచుకుని, కళ్లు క్రిందకు వాల్చుకుని కూర్చుంటే అతనసలు వెళ్లేవాడు గాదు. వెళ్లిం తర్వాత రాలేకపోవటం అతని తప్పు కాదు. కాని యేలా ? ఎన్నాళ్లిలా గుప్పెట్లో పట్టుకుంటుంది. అతని ఆదరణకోసం తను బాధపడుతున్నట్లు ఎన్నాళ్ళు నటించగలుగుతుంది. ఒకళ్లు కావాలని గుప్పెట్లో పట్టుకోవాలని ప్రయత్నించి ఉంచుకునేదా ఆ బంధం ? ఎంత సున్నితమైంది. కాని తనేం చేస్తుంది ? తనేం చెయ్యగల్దు ! అసలు కాలుకి దెబ్బ తగలకుండా ఉంటే బాగుండేదేమో! తన కప్పుడు యీ లోతులు తెలిసేవికావు. నిట్టూర్పుతో మంజు వెనక్కు వాలింది. మందు వేసుకోలేదు. ఈ వారం రోజుల్లో ఒక్కరోజు తన చేత్తో తను మందు వేసుకోలేదు. టేబిల్‌మీద తొంగిచూస్తున్న మందుగ్లాసు వైపు దృష్టి నిగిడ్చి అలాగే ఉండిపోయింది మంజు.

ముందరి హాల్లో ఉన్న గడియారం 8 గం. 9 గం. గూడ కొట్టింది. శేఖరం వత్తాలేదు. ఎంత వద్దనుకున్నా మంజు మనసు బాధపడకుండా ఉండలేకపోయింది. ఇప్పుడు ఉన్నపళంగా జ్వరం వచ్చేస్తే—శేఖరం రాగానే—మసలిపోతున్న తన ఒళ్లు పట్టిచూస్తే — అరె — యిదేమిటి యింతకుముందు బాగానే ఉన్నావుగా అని ఖంగారు పడ్తే చాలా బాగుంటుంది. కాని అలా జరగలేదు. ఆలోచించి ఆలోచించి నీరసం తలనొప్పి మట్టుకు వచ్చాయి. కాని అవి పైకి కన్పించవు.

గడియారం 9 గంటలు కొట్టిన పది నిముషాలకి బైట కారు హారన్ విన్పించింది. అంతవరకూ ఆలోచిస్తూ గోడకి చేరగిలబడి కూర్చున్న మంజు చేతికున్న గడియారం తీసేసి దూరంగా పెట్టి పడుకుని కళ్లు మూసుకుంది.

“మంజూ !” అనే పిలుపు కోసం చెవులు శ్రద్ధగా వింటున్నాయి. కాని శేఖరం పిలవలేదు. “మంజూ నిద్రబోయిందా. మందు వేసుకుందా” అని మటుకు హాల్లో శంభుని అడగటం విన్పించింది. ‘ఆ !’ రెండింటికీ కలిపి ఒక్క అక్షరంలో సమాధానం యిచ్చాడు శంభు. అమ్మగారు మందు వేసుకోవటంలో అశ్రద్ధ చెయ్యరు. అది ప్రత్యేకం అడగక్కర్లేదు. ఇహ పోతే, గదిలో లైటు తీసేసి చాలాసేపయింది. శబ్దంగూడ లేదు. అలా నిశ్శబ్దంగా కూర్చోవటం మంజు స్వభావానికి విరుద్ధం. అందుకే నిద్రబోయిందని చెప్పాడు.

నిద్రపోయిన మంజుని లేపి తను ఆలస్యంగా వచ్చానని గుర్తు చెయ్యటం యిష్టంలేని శేఖరం వెంట తెచ్చిన నాటకాల్లో క్లబ్ వార్షికోత్సవానికి వేస్తున్నదాన్ని పరిశీలించటంలో నిమగ్నుడై పోయాడు.

మర్నాడు శేఖరం నిద్రలేచేసరికి మంజు లేచి మామూలుగా తిరుగుతోంది. ‘మళ్లా తిరుగుతున్నావు. కాస్త నాలుగు రోజులు విశ్రాంతి తీసుకోగూడదూ. కాలు పచ్చి యింకా సాంతం పోలేదు.’ రాత్రి తను ఆలస్యంగా రావటం మంజుకి కోపం వచ్చిందని సులువుగానే గ్రహించిన శేఖరం తనే స్వయంగా కల్పించుకుని అన్నాడు.

“ఏం ఫర్వాలేదు. కాలుని గురించి దిగులు పడవలసింది నేను. బాగానే తగ్గిపోయింది. తగ్గకపోయినా ఫర్వాలేదు. మీ రింక మీ మీటింగ్సుకి వాటికి మానుకోవాల్సిన అవసరమేం లేదు.” మంజు ఎత్తిపొడుపుకి శేఖరానికి కోపం వచ్చింది. అంతేమరి. ఆడవాళ్ల తత్త్వమే అంతేనేమో. నిన్నటిదాకా తాను చేసిందంతా ఒక్కరాత్రిలో మర్చిపోయింది. శేఖరం గూడా ముభావంగానే ఉండిపోయాడు. కనీసం ఆలస్యం అయింది అని గూడ చెప్పగూడదూ. రాత్రి తను అంతసేపు ఎదురుచూస్తే—అసలు తనకు కాలు నయం కాకపోతే యింకా ఎంత సంతోషించేవాడో. శేఖరంమీద కోపంతో మంజు ఇంట్లో నౌకర్లందరికీ ఒక్కసారి శలవు యిచ్చేసింది. ఎన్నాళ్లనుంచో అడుగుతోంది వంటమనిషి—ఒక్క నాలుగు రోజులు బెజవాడ వెళ్లి మా చెల్లెల్ని చూసివస్తానని. సెలవు యివ్వటమేకాదు, రైలు ఛార్జీలు కూడయిచ్చి మరీ నాలుగురోజులున్నా ఫర్వాలేదు. నా కాలు నయం అయ్యిందిగా అని చెప్పి పంపించింది. శంభు పెద్దవాడైపోయాడు. రాత్రిపూట దగ్గు అదీ విపరీతంగా వస్తోందట. నాలుగు రోజులు కదలకుండా మందు తీసుకోమని ఆజ్ఞలు జారీ చేసింది.

ఇహపోతే రాజు. రాజుకి శలవు తీసుకోమనే ఎవరూ చెప్పక్కర్లేదు, ఎవరూ పిలవకపోతే అతని తీసుకుంటాడు.

‘అందరినీ ఒక్కసారి ఎందుకు పంపావు ? ఇంట్లో పనులన్నీ ఎవరు చేస్తారు. నీ కాలు యింకా పచ్చి మాననేలేదు. అయినా నాతో మాట మాత్రం గూడ చెప్పక్కర్లేదా ? ఇంట్లో నేనంత అనామకుడిగా ఉన్నానా ?’ ప్రతి చిన్న పనికి తనే కుంటు కుంటు తిరుగుతున్న భార్యని చూసి బాధపడ్తూ కోపంతో అన్నాడు శేఖరం. మంజు ఎప్పుడూ అంతే ! శేఖరంమీద కోపం వస్తే తనమీద సాధించుకుంటుంది.

“నేను కాపరానికి వచ్చింతర్వాత మీతో చెప్పకుండా స్వతంత్రంగా చేసిన పని యిదొక్కటేగా. ఎన్నిసార్లు ‘నీ యిష్టం—నీ యిష్టం వచ్చినట్లు చేసుకో మంజూ’ అని మీరు అనలేదు ? కానీ నే నెప్పుడూ నా యిష్టానుసారంగా వెళ్లనే వెళ్లలేదు. ప్రతిదానికీ మిమ్మల్ని అడుగుతూనే వచ్చాను. ఈ ఒక్క చిన్న విషయం అడగపోయినా ఫర్వాలేదు అనుకున్నాను. నాకేం తెలుసు. ‘నీ యిష్టం—నీ యిష్టం’ అనే మీ మాటలకి విలువ లేదని, అవి తాత్కాలికంగా నాలిక చివరినుంచి వచ్చాయని. పెళ్లయిం తర్వాత నేను చేసిన మొదటి తప్పు ఇది. ఫర్వాలేదు. మీరు క్షమించవచ్చు.”

బాగా దగ్గరగా వచ్చి, తగ్గు స్థాయిలో ఖచ్చితంగా కోపంగా అంటున్న మంజు వంక రెప్ప వాల్చకుండా చూడసాగాడు శేఖరం.

నిన్న మొన్నటి వరకు పసిపాపలా, దేవకన్యలా ఉన్న మంజుకి యీరోజు ఏమైంది ? తనెందుకు అంటున్నాడు. మంజు మంచికోరి కాదు. కాస్త గూడ అర్థం చేసుకోదే ? ఈసారి శేఖరానికి నిజంగానే కోపం వచ్చింది. అక్కడినుంచి కదిలి వెళ్లిపోతూ ‘సరే. నీయిష్టం. నీయిష్టం వచ్చినట్లు తిరుగు. కానీ యీసారి కాలునొప్పి అంటే మటుకు’ శేఖరం ఏదో చెప్పబోయాడు.

‘అనను. అనను. అంటే ఒప్పే—సరేనా ? కాలు నొప్పెస్తే కాదు — నా రెండుకాళ్లు తీసేసినా, రెండు చేతులు నరికేసినా, కళ్లు రెండూ గుంటలుపడి కన్పించకపోయినా బాధ అనిగాని, అబ్బా అనిగాని అనను సరేనా ?’ శేఖరం వంక చూస్తుండగానే మంజు కళ్లు నీళ్లతో నిండిపోయినాయి.

‘మంజూ’ శేఖరం చప్పున దగ్గరకు రాబోయాడు. కానీ అతను వచ్చేలోపలే అక్కడ్నించి పారిపోయింది మంజు మొహం రెండు చేతుల్లో కప్పుకుని.

ఆరోజు భోజనం చెయ్యకుండానే వెళ్లిపోయాడు శేఖరం. మంజు యేదన్నా భరిస్తుంది కాని శేఖరం వేళకు భోజనం చెయ్యకపోతే ఊరుకోలేదు. అతను బైట ఏదీ తినడు. అందరిలా అతను హొటల్ తిళ్లకి అలవాటుపడ్డవాడు కాదు. ఉదయం యిచ్చిన కాఫీ గూడా తాగలేదు. 12 గంటలకు క్యారియర్‌లో భోజనం సర్ది రాజుతో ఆఫీసుకి పంపింది. క్యారియర్‌తోపాటు ‘నామీద కోపం యీ భోజనంమీద చూపించకండి. మీరు పూర్తిగా భోంచేసిందీ లేనిదీ రాజు పరీక్షగా చూస్తూనే ఉంటాడు. త్వరగా వచ్చెయ్యండి” అని రాసి పంపింది.

క్యారియర్ తీసుకుని రాజు వెళ్లిపోయాడు. “అవును. నేనే సర్దుకోవాలి. శేఖరం మగవాడు. అతనికి బోలెడన్ని పనులుంటాయి. ఎప్పుడూ నా కొంగు పట్టుకుని కూర్చోమంటే ఎలా సాగుతుంది. అతను నిర్వర్తించవలసిన కర్తవ్యాలలో నాపట్ల చూపే ఆదరాభిమానాలు ఒక భాగం మాత్రమే. నాకు అతను ఒక్కడే లోకం కావచ్చు. కానీ అతనికి నే నొక్కదాన్నే లోకం ఎలా అవుతాను ? అది నేనే అర్థం చేసుకోవాలి” అనుకుంది.

భోజనం అదీ పూర్తిచేసుకుని మంజు వచ్చి హాల్లో కూర్చుంది. కళ్లు గడియారాన్ని గమనిస్తున్నాయి. చెవులు చప్పుడు కాబోయే పాదాల శబ్దానికి ఎదురు చూస్తున్నాయి. చేతులు మటుకు పరధ్యానంగా దిండు కవరుమీద రంగు దారాలతో పూలు కుడుతున్నాయి. మనసు మరో చోట ఆలోచిస్తోంది. ఈసరికి రాజు వెడ్తాడు. క్యారియర్ టేబిల్‌మీద పెట్టి తనిచ్చిన ఉత్తరం యిస్తాడు. అది చదువుకున్న శేఖర్ వచ్చి కోపంగానే భోజనం ముందు కూర్చుంటాడు. కూర్చోబోతుండగా మరోసారి తన మాటలు జ్ఞాపకం వస్తాయి. శేఖర్ తల తిప్పిచూస్తాడు. ప్రక్కన ఏదో సర్దుతున్న నెపంతో రాజు నిలబడి ఉంటాడు. రాజుని గమనించిన అతను నవ్వుకుంటూ శ్రద్ధగా

PAKCO ప్రాకో స్లో-స్పీడ్, కోల్డు స్టార్టింగ్ క్రూడ్ ఆయిల్ ఇంజనులు

—: ప్రత్యేక లక్షణములు :—

* పనిచేయ ప్రారంభించుట తేలిక
* తక్కువ ఇంధన ఖర్చు
* క్రమమైన నడక
* దిట్టమైన నిర్మాణం
* ఎక్కువ మన్నిక
* అద్భుతంగా పనిచేయును
* బాష్ ఫ్యూయల్, ఇంజక్షన్ పరికరములు



మద్రాసు, ఆంధ్ర, కర్ణాటక, కేరళ రాష్ట్రములకు ఏజెంట్లు :

Grams : LAMP **K. S. SHIVJI & CO,** (Estd 1903)

Phone:3617 పోస్టుబాక్సు నెం. [illegible] 178 79 [illegible], మద్రాసు-1.

ఎటువంటి ప్రదేశానికైనా

చమత్కారంగా పెయింటు వేయుటకు

షాలిమార్ సూపర్‌లాక్

సింథెటిక్ ఎనామెల్

- త్వరగా ఆరి, గట్టిగా పట్టివుండే మంచి నిగారింపుగల సింథెటిక్ ఎనామెల్
- లోపట్ల, బయట వాడుటకు
- బ్రష్‌తోను, స్ప్రేతోను లేక వస్తువును ముంచివేయవచ్చును.
- ఒక దానితో ఒకటి కలుపుటకు వీలైన 38 రంగులున్నాయి.

JWTSPW 549 TEL

SHALIMAR PAINT COLOUR & VARNISH COMPANY LIMITED.

Calcutta - Bombay - Madras - New Delhi - Kanpur

(బర్మా, సిలోనులకు ఎగుమతిదారులు)

తెలిసిన పిలవలు

భోంచెయ్యవచ్చు. లేకపోతే లెక్కేమిటని నిర్లక్ష్యంగానూ భోంచెయ్యవచ్చు.

బైట సైకిల్‌బెల్ వినపడటంతో మంజు ఉలిక్కిపడి తలెత్తింది. రాజు క్యారియర్ తీసుకుని తిరిగి వచ్చాడు.

"ఏమన్నారు అయ్యగారు ?" గబుక్కున అడిగేసింది.

సమాధానంగా రాజు నవ్వుతూ ఏం చెప్ప లేదు. పోనీ జేబులోంచి ఏ కాగితమూ తీసి యివ్వనూ లేదు. నిదానంగా దగ్గరకు వచ్చి 'ఆఫీసులో లేరమ్మా. వచ్చి ఒక పది నిముషాలు ఉండి వెళ్లిపోయారని చెప్పారు. క్యారియర్ తెచ్చేశాను' అన్నాడు.

మంజు చేతులు అంతవరకు కుడుతున్న దిండు గలీబుని నిర్లక్ష్యంగా పక్కకు విసిరేసాయి. అంతవరకు ఆసక్తితో గడియారం వంక చూస్తున్న కళ్ళు కోపంతో ఎరుపెక్కాయి. పెదవులు మటుకు లోపల కలిగిన కోపాన్ని దాచుకుని 'సరే, నువ్వెళ్లి లోపల పని చూసుకో' అన్నాయి.

రాజు లోపలికి వెళ్లిపోయాడు. మంజు లేచి వచ్చి గదిలో మంచంమీద పడుకుంది. ఎక్కడకు వెళ్లినట్లు ? ఇంకెక్కడికి ? క్లబ్ వార్షికోత్సవం దగ్గరకు వస్తోందిగా—ఆ రాజాదగ్గరకు వెళ్లి ఉంటారు. వెళ్లేవారు భోంచేసి వెళ్లగూడదూ ? తనిక్కడ అనవసరంగా ఖంగారు పడుతూంటే యింకేం—ఆ రాజాదగ్గర భోంచేసి హాయిగా నవ్వుతూ సిగరెట్ కాల్చుకుంటూ ఖబుర్లు చెబుతుండవచ్చు. మంజు ఒకసారి తన పాదంవైపు చూసుకుంది. దెబ్బ తగలటం వోవిధంగా మంచిగానే అయింది. తనకి కొన్ని లోతులుతోపాటు మరికొన్ని అర్థాలు కూడా తెలిశాయి. పోనీ చెప్పగూడదూ యిలా వెడుతున్నానని. తను కాదంటుందా ? పోయిన కోపం రెట్టింపు బలంతో వచ్చి మళ్లీ తిష్ట వేసింది. ఆరోజు కాదు. ఆరు రోజులు. ఆరు నెలల వరకూ శేఖర్‌తో ఆప్యాయంగా మాట్లాడకూడదు. అతను కేవలం భార్యగా చూస్తుంటే తనేనా చూడలేంది. తనూ చూడగలదు. ఈ క్షణంతో అతను కేవలం భర్త! భర్తగా యివ్వవలసిన గౌరవం మాత్రమే యిస్తుంది. అప్పైన పిసరంత ఆప్యాయత గూడ చూపించగూడదు. అంతే. మంజు మనసులో గట్టిగా ఒట్టు వేసుకుంది.

హాల్లో గడియారం మూడు కొడుతుండగా వాకిట్లో కారు హారన్ విన్పించింది. ఆ కారు హారన్ శేఖర్‌దని తెలిసిన మంజు మంచంమీద నుంచి లేవలేదు. హాల్లో ఏదో పనిచేస్తున్న రాజు గేటు తీయుటం కోసం పరుగెత్తిన శబ్దం విన్పిస్తోంది. లోపలికి కారు వచ్చిన శబ్దం కూడ విన్పిస్తోంది. వింటూ పడుకుంది మంజు ఏమాత్రం చలనం లేకుండా !

రాజు పరుగెత్తుకుంటూ లోపలికి వచ్చాడు. 'అమ్మగారూ. శేఖరం బాబుకి కళ్ల కేమిటో కట్టు కట్టారు. వెంట డాక్టర్ యోగానందంగా

రున్నారు.' రాజా మాటలు పూర్తిగా వినకుండానే మంజు లేచి హాల్లోకి పరుగెత్తుకొచ్చింది. అప్పటికే శేఖరం లోపలికి వచ్చాడు. అతని కళ్ళు రెండు తెల్లటి బాండేజితో ఉన్నాయి. చెయి పట్టుకుని నడిపిస్తున్న డాక్టర్ యోగానంద్ గోడవారగా ఉన్న కుర్చీ చూపిస్తున్నాడు. ప్రక్కన రాజా గూడా ఉన్నాడు.

'ఏమిటది. ఏమైంది ?'హాల్లో గుమ్మందాటి రాబోయి, ఆగిపోతూ అంది మంజు. ఆరోజు తన పాదం తెగినప్పుడు సరీగ్గా ఏ కుర్చీలో కూర్చుందో అదే కుర్చీలో కూర్చున్నాడు, శేఖరం.

మంజు పిలుపుకి రాజా తల తిప్పి చూసాడు. డాక్టర్ యోగానంద్ మంజు వైపుగా వస్తూ 'ఈరోజు లేచినవేళ చాలా మంచిదమ్మా. చాలా పెద్ద అపాయం. వెంట్రుకవాసిలో తప్పిపోయింది. ఈరోజు శేఖరం కన్ను పూర్తిగా పోవాల్సింది. కేవలం నీ అదృష్టం' అన్నాడు.

'ఏమైంది ?' అస్పష్టంగా యింకా అలాగే నిలబడిపోయి అడుగుతోంది మంజు.

''క్లబ్ వార్షికోత్సవం రేపని మీకు తెలుసు గదా ! స్టేజీ ఏర్పాట్లు చూస్తున్నాం. రేపు మేం వెయ్యబోయే నాటకానికి ప్రత్యేకంగా తెరలూ అవీ ఏర్పాటు చేస్తున్నాం ఆ తెరల ఏర్పాటుకి ఇనప తీగె ప్రక్కన అమర్చి క్రింద గుంజుతున్నాం. అది సరీగ్గా ఉందో లేదో చూడబోతే శేఖరానికి పొరబాటుగ వచ్చి కంటికి తగిలింది. పైన వైర్‌ని ఫిట్ చేస్తున్న అతను శేఖరాన్ని చూడకుండా గుంజాడు. అది మొహంమీదనుంచి రాచుకు వెళ్ళటంలో చేరుకుపోయింది.

రాజా ముందుకువచ్చి చెప్పాడు.

''భయంలేదమ్మా ! అంతపెద్ద ప్రమాదం లేదు. కానీ కళ్ళకి ఏమాత్రం అలసట కలగగూడదు. అందుకే యువతరి కన్నుకి గూడ కట్టు కట్టింది. ఈరోజు, రేపు యింట్లోంచి కదలకుండా చూసే భారం నీది. రేపు క్లబ్ వార్షికోత్సవం గూడాను. ఏదైనా యింట్లోంచి కదలగూడదు. శేఖరం నీకే చెబ్తోంది.'' డాక్టర్ యోగానంద్ మంజుకి ధైర్యం చెబుతున్నట్లు, హెచ్చరిస్తున్నట్లు రెండు విధాలుగా అన్నాడు.

రేపే క్లబ్ వార్షికోత్సవం. ఆరోజుకోసం శేఖరం ఎన్ని ఏర్పాటు చేస్తున్నాడో మంజుకి తెలుసు. కానీ రేపటిరోజున కళ్ళు తెరవటానికే వీలులేదు. వస్తుంది—వస్తుంది అనుకుని ఎదురుచూసిన క్షణం వచ్చినప్పుడు ఎందుకూ కొరగాకుండా పోతే ! శేఖరం మొహంలో ఎలాటి మార్పు లేదు. చాలా రోజులునుంచి అలా కూర్చోవటానికి అలవాటుపడ్డవాడిలా కూర్చున్నాడు.

''ఫర్వాలేదులే. నేను అన్నీ చూసుకుంటాను. నువ్వూరికే బాధపడకు.' అన్నాడు రాజా వెళ్ళబోయేముందు.

''నువ్వు చూసుకోగలవనే ధైర్యం నాకుంది.నేను ఆ టైమ్‌కి మటుకు వస్తాను.నాకుదిగులేంలేదు.''

దెబ్బ తగిలిందని అతను ఖంగారు పడటం లేదు. మంజుని పిల్చి దగ్గరగా తీసుకోలేదు. నిశ్చలంగా కూర్చుని రేపు జరుపబోయే వాటికి ఏవేవి తను చేశాడో—ఇంకా మిగిలినవి రాజా ఏవేవి చెయ్యాలో నిదానంగా తాపీగా చెప్తున్నాడు. అన్నీ వింటూ బొమ్మలా అక్కడే నిలబడిపోయింది మంజు. క్షణంసేపు శేఖరానికి ఏ దెబ్బ తగలలేదు. అంతా నటనేమో అన్పించింది. మరుక్షణంలో అతని ఆత్మవిశ్వాసానికి అన్నీ వట్టించుకున్నట్లుండి మళ్ళీ అవసరం అయితే దేనికీ లొంగకుండా అతీతంగా ఉండే స్థిరమైన అతని వ్యక్తిత్వానికి ముగ్ధురాలయి అలాగే నిల్చుండిపోయింది.

కొద్దిసేపయిం తర్వాత యోగానంద్, రాజా వెళ్ళిపోయారు. వెళ్ళిపోబోయే ముందు, రేపు సాయంత్రం ఒక్క పావుగంట పాటు శేఖరం స్పీచ్ యివ్వవలసిన టైమ్‌కి కట్టువిప్పి మళ్ళీ వెంటనే కట్టేసేటట్టు ఒప్పుకున్నాడు యోగానంద్. ఒప్పుకున్నాక గాని వెళ్ళనివ్వలేదు శేఖరం.

వాళ్ళిద్దర్నీ గుమ్మందాకా సాగనంపి వెనక్కి తిరిగివచ్చింది మంజు.

''మంజూ. ఇలారా'' వెనక్కు తిరిగి వస్తున్న పాదాలచప్పుడు గమనిస్తూ అన్నాడు శేఖరం.

''గుంర్తొచ్చానా యిప్పటికైనా ?' అతనికి కొద్ది దూరంలోకి వచ్చి ఆగిపోతూ అంది మంజు.

''ముందిలారా ! రాజావాళ్ళెవ్వరూ యిక్కడ లేరుగదూ !'' శూన్యంలోకి చెయిజాపుస్తూ మంజు

రైలు ప్రయాణంలో
కొడుకు అల్లరిచేస్తుంటే, తల్లి
"రెండు తగల నివ్వమన్నావా!
కూర్చుంటావా?" అని అంది.
"కొట్టు, ఎలా కొడుతావో
చూస్తాను. టికెట్టు కలెక్టరువస్తే,
నా అసలు వయస్సు చెప్తాను.
అని అన్నాడు కొడుకు.

ఆర్. కొండయ్య (కావలి)

మాట వినవచ్చిన వైపుగా అన్నాడు శేఖరం. మంజు చప్పున వచ్చి శేఖరం చేయి అందుకుని అందులో మొహం దాచుకుంది.

''ఏమిటది. చ. చ. ఏడుస్తున్నావా ? ఈమాత్రానికే ? ప్రమాదం లేదుగా డా. యోగానంద్ అన్న మాటలు విన్నావా ? కేవలం నీ అదృష్టం అన్నాడు. ఏదీ నీకాలు ఎలాఉంది ? ఈరోజు నేనసలు చూడనే లేదు. 'శేఖరం వంగి తడుముతూ మంజు పాదం కోసం వెతకసాగాడు.

''నా పాదానికేం—ముందు మీరిది చెప్పండి. ఒకవేళ నిజంగానే కన్నుకి దెబ్బ తగిలినా, దురదృష్టవశాత్తు ఏ ప్రమాదం జరిగినా మీరింత నిశ్చలంగా ఉండగలరా'' శేఖరం చేతిని తన రెండు చేతుల్లోకి తీసుకుంటూ అంది మంజు.

''ఎందుకుండను ? తప్పకుండా. ఇప్పుడు నాకు చాల హాయిగా ఉంది. నిశ్చింతగా కళ్ళు మూసుకుని నీ యెదుట కూర్చోవచ్చు. నువ్వనేది, ఎప్పుడూ కోరుకునేది అదేగా. నువ్వు కోరుకున్నట్లుగా యిహ నీ ముందే కూర్చుంటా. ఒక్కసారైనా విసుక్కోమరి. చెప్తాను నీ పని.' మంజు చేతితో ఆడుకుంటూ అన్నాడు శేఖరం.

''మీ రెప్పుడూ నాముందుండాలని కోరుకోవటం—మిమ్మల్ని ఏ కుంటివారో, గుడ్డివారో కమ్మనా ? నాకోసమేనా యీ దెబ్బ తగిలింది.'' శేఖరం చేతుల్లోంచి తన చెయి గుంజుకుంటూ అంది మంజు.

''అదుగో మళ్ళీ కోపం వస్తోంది నీకు. నానుంచి నువ్వు దూరంగా పారిపోతే నేను నీవెంట రాలేనుగా. కోపం పోయిం తర్వాత మళ్ళీ నువ్వే రావాలి !'' మంజు మళ్ళీ దగ్గరగా వచ్చి చెయి యిచ్చింది. ఆ చేతిని తీసుకుని మంజుని దగ్గరకు లాక్కుంటూ అన్నాడు శేఖరం.

'చూడు మంజూ ! ప్రతిదాన్నీ నిమిత్తమాత్రంగా తీసుకోవాలి. నిజంగా బాధపడవలసిన పరిస్థితిల్లో అది మనం ఆపుకున్నా ఆగదు. కానీ—ఏదో జరగబోతోంది, కాబోతోంది అని బాధపడటం దుర్బలత్వం. జరిగిందానికి విచారించటం యోగ్యునిలక్షణం. ఎప్పుడో ఏదో జరగబోతుందీ అని ముందే బాధపడటం, అది పిరికివాళ్ళ లక్షణం. తెలిసిందా ! కంటికి దెబ్బ తగిలింది. కొంచం బాధగానే ఉంది. కానీ దాన్ని యింతగా చిత్రించుకుని మనశ్శాంతి పాడుచేసుకోవటంవల్ల కలిగిన ప్రయోజనం ఏమిటి చెప్పు ?''

''మరి నా కాలుకి తగిలిన దెబ్బ కూడ చిన్నదే —నాకంత బాధ ఎందుకన్పించాలి ? దాదాపు లోకమే శూన్యమైనట్టు, జీవితమే స్తంభించి పోయినట్లు అన్పించటం దుర్బలత్వమేనా ? అయితే నేను పిరికిదాన్నన్నమాట—మరి—''

''లేదు. నీది పిరికితనం కాదు. అదీ అందమైన భావం. కాలు ఏమైపోయినా నీకు దిగులు లేదు. కాని దానివల్ల నేను దూరమైపోతానేమోనని నీ భయం—అవునా ? ఆ భయం నాకు లేదు. నీలా నాకు నీమీద అనుమానాలు లేవు. ఒకవేళ దెబ్బ కొంచెం పైగా తగిలి నిజంగా కన్ను పోయినా నేను విచారపడేవాడ్ని కాదు. నాకు తెలుసు. నా కన్ను పోతే నువ్వు నా కన్నువవుతావని. చెప్పు. కాదా ? నేను ఉదయంనుంచి ఏం తినలేదన్న సంగతి నువ్వు మర్చిపోయావులా వుందే ? ఆకలౌతోంది. నీ చేతులో తినిపిస్తే తింటాను. ఏదీ—నన్ను మన గదిలోకి తీసుకెళ్ళు. రేపు క్లబ్‌కి కూడా నువ్వే తీసుకెళ్ళాలి. చూడు మరి నువ్వు సరదాకి నేర్చుకున్న కారు డ్రైవింగ్ ఎలా ఉపయోగపడోతుందో ! ఎక్కడ ఆలోచిస్తున్నావు ? ఒక్క దానికీ సమాధానం చెప్పవే.''

''అహ. లేదు లేదు. పదండి గదిలోకి తీసుకెడ్తాను.'' అంది మంజు కుర్చీలోంచి లేచిన శేఖరానికి చెయి ఆసరాయిస్తూ.

''ఏమిటది ?''

''మీరు చెప్పిందే ! అన్నింట్లో తిరుగుతూ మళ్ళీ అన్నింటికీ అతీతంగా ఉండటం.''

''అంతేగాని—మీలో నాకేం అనుమానం లేదు. అనవన్నమాట. అదేమో నువ్వు తెలుసుకున్న సత్యం అనుకున్నాను'' అన్నాడు శేఖరం ముందుకు వెయ్యబోతున్న అడుగు ఆపివేస్తూ.

''లేదు. లేదు. మీలో నా కెప్పుడూ అనుమానం లేదు. ఎందుకో ఒక్కొక్కసారి అలా అంటాను గాని. అదిగూడ మీకు తెలిసే ఉంటుంది. పదండి'' అంది మంజు కళ్ళు తుడుచుకుని శేఖరం చెయి పట్టుకుని ముందడుగు వేస్తూ.

మంజు మనసులో మారుమూల ఎవరో అంటున్నారు. ఇప్పుడు కాదు కొన్ని కోట్ల యుగాలు గడిచినా అంతేనేమో! స్త్రీ పురుషుల్లో ఉండేయీ అతి నాజూకైన భావాలకి మార్పు లేదేమో!అని. ★